క్లుప్తంగా

వడియరాజుల పిల్లలను బాగా చదివించాలి



సత్తెనపల్లి: వడియ రాజులందరూ తమ బిడ్డలను బాగా చదివించాలని, చదువే ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుందని వడియరాజుల సంఘం పట్టణ అధ్యక్షుడు వేముల వెంకట వరప్రసాదరావు అన్నారు. రెంటపాళ్ళకు చెందిన వైఎస్సార్ సీపీ మండల యూత్ మాజీ అధ్యక్షుడు కొమెర శివశంకర్ కుమారుడు రూకేష్ పదవ తరగతి ఫలితాల్లో 552 మార్కులు సాధించగా..మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అభినందించారు. వర ప్రసాదరావు మాట్లాడుతూ బిడ్డలకు ఇచ్చే ఆస్తి చదువేనన్నారు. చదువు సమాజంలో ఆత్మగౌరవం పెంపొందిస్తుందన్నారు. రూకేష్‌ను, శివ శంకర్‌ను సన్మానించారు. న్యాయవాది చెంబేటి శివరామకృష్ణ, సంఘ నాయకులు బత్తుల సాంబశివరావు, ఒంటిపులి అరుణ్ పాల్గొన్నారు.

8 నామినేషన్లు దాఖలు



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి 5వ రోజు మంగళవారం 8 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబటి రాంబాబు తరపు కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ మురళీకృష్ణకు అందించారు. వై.ఉపేష్ చంద్ర చౌదరి తదితరులు ఉన్నారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా పి.నవీన్‌బాబు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా గోదా వెంకటరమణ రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బొర్రా వెంకట అప్పారావు, శూలం రాజ్యలక్ష్మి, మేకల వేణు మాధవ్ రెడ్డి, కందుకూరి జక్రయ్య తమ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందించారు.

ఇంటర్ ఉచిత ప్రవేశానికి 'శ్రీ సనారీ' ట్రస్టు ఆహ్వానం

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం ట్రస్టు ద్వారా పదవ తరగతిలో 400 మార్కులు దాటిన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో పూర్తి ఉచిత విద్యను అందించనున్నట్లు ఆశ్రమ వంశ పారంపర్య ధర్మకర్త, మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ మంగళవారం తెలిపారు. ట్రస్ట్ కళాశాల ద్వారా ఫీజు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బస్సు, హాస్టల్ వసతి అందించనున్నట్లు ఆమె తెలిపారు. గతేడాది ట్రస్ట్ ద్వారా ఉచిత ప్రవేశం పొందిన విద్యార్థులు జూనియర్ ఇంటర్‌లో 452, ద్వితీయ సంవత్సరం 953, 952 అత్యధిక మార్కులు సాధించారని చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రుపుల్లో 25 మంది విద్యార్థులకు పూర్తి ఉచిత విద్య అందించేందుకు నిర్ణయించామని తెలిపారు. కుల, మత ప్రాధాన్యం లేకుండా ఎవరైనా ఉచిత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తులను మే 15 లోగా శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, గుంటూరు రోడ్డు, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా...చిరునామాకు పంపాలని వెల్లడించారు. పూర్తి వివరాలకు 94403 83782, 94913 00312 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి అంబటి రాంబాబు విజయాన్ని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. మండలంలోని మాదల, ఇరుకుపాలెం, రుద్రవరం, తొండపి, దమ్మాలపాడు, బొల్లవరం, ముప్పాళ్ళ, కుందురువారిపాలెం, గోళ్ళపాడు గ్రామాల్లో పూర్వ వలంటీర్లతో కలిసి ప్రచారం చేపట్టారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలు అందజేశారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 24, 25 తేదీలలో నామినేషన్ల కార్యక్రమాలకు తరలి రావాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, ముప్పాళ్ళ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి సాయిరెడ్డి, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, మాజీ మండల కన్వీనర్ ఇందూరి నరసింహారెడ్డి, సైదా, కానాల పుల్లారెడ్డి, చిమటా శ్రీనివాసరావు, దమ్మాలపాటి బుజ్జి, సర్దార్, నాగిరెడ్డి, గంటాశ్రీనివాసరావు, తాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

అచ్చంపేట: 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అభినందనలు తెలిపారు. వేల్పూరు జడ్పీ హైస్కూలు, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం, ఎక్కువ మంది 550పైగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. స్థానిక బ్లూబెల్స్ పబ్లిక్ స్కూలు విద్యార్థిని డొక్కు రిషిత 595 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండువ ర్యాంకు సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

రేపు అట్టహాసంగా మంత్రి అంబటి నామినేషన్

భారీగా తరలిరానున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

సత్తెనపల్లి: పల్నాడు ముఖద్వారమైన సత్తెనపల్లి నుంచి సార్వత్రిక సమరానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సిద్ధమయ్యారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాజుపాలెం మండలం దేవరంపాడు నేతి వెంకన్నస్వామిని దర్శించుకొని ర్యాలీగా నామినేషన్‌కు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరానున్నారు. వారికి కోసం భోజన స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు.

అంబటి రాంబాబు రాజకీయ ప్రస్థానం..



అంబటి రాంబాబు

గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించిన అంబటి రాంబాబు విశాఖపట్నంలోని న్యాయ విద్యా పరిషత్ లా కళాశాల నుంచి 1986లో బీఎల్ పూర్తి చేశారు. విద్యార్థి సంఘ నాయకుడిగా అంచలంచెలుగా ఎదిగిన ఆయన 1988లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్‌గా, 1994లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, సాంప్రదాయ ఇంధన వనరుల అభివద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపు పోటీ చేసి, తొలిసారి చిన్న వయసులో శాసన సభ్యుడిగా అసెంబ్లీకి ఎన్నియ్యారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా నియమితులయ్యారు. అనంతరం 1994, 1999లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచారు. వైఎస్సార్ సీపీలో చేరి రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టారు. వైఎస్ జగన్ ఆదేశాలతో 2012లో సత్తెనపల్లికి వచ్చారు. 2014లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఇక్కడి నుంచి పోటీ చేసి 924 స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. మళ్లీ 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి, టీడీపీ అభ్యర్థి కోడెల శివప్రసాదరావుపై 20,876 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. 2022 ఏప్రిల్ 11న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఐదేళ్ల పాలనలో అంబటి చేసిన అభివృద్ధి..

- గడిచి ఐదేళ్లలో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా అంబటి రాంబాబు నియోజకవర్గంలో రూ.2,012 కోట్లతో సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేలా కృషి చేశారు. రూ. 225కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా సత్తెనపల్లిని రెవెన్యూ డివిజన్ చేయించారు.
- మూడు నియోజకవర్గాలకు కేంద్రమైన సత్తెనపల్లిలోని ఏరియా వైద్యశాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించారు. పట్టణంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాలను నిర్మించారు.
- కొండమోడు - పేరేచర్ల ప్రధాన రహదారి నాలుగు లేన్లుగా విస్తరించేందుకు నేషనల్ హైవేలో కలపగా భూ సేకరణ పూర్తయి టెండర్ల ప్రక్రియ కూడా జరిగింది.
- నరసరావుపేట రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను, మాచర్ల రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను శాస్త్రీయ పద్ధతిలో తొలగించేందుకు శ్రీకారం చుట్టారు.
- పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో పాటు గృహ నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి.

మార్కుల వీరులు



సీహెచ్ కోమలి



సీహెచ్ దీపికాంజలి



కె.రేణుక



సీహెచ్ అంజలి



ఎ.రూపశ్రీ



షేక్ వసీమాసుల్తానా



ఎస్డీ సాగుప్తా



పి.కావ్యశ్రీ

- 'పది' ఫలితాల్లో బాలికోన్నత పాఠశాల ప్రభంజనం
- 87 మంది విద్యార్థినులకు ఫస్ట్ క్లాస్
- 18 మందికి 500కు పైగా మార్కులు



షేక్ సనా



ఎం.శివపార్వతీ

సత్తెనపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. 179 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా.. 130 మంది ఉత్తీర్ణులయ్యారు. 73 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 150 మంది పరీక్షలకు హాజరు కాగా 73 మంది ఉత్తీర్ణులయ్యారు. 52 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది 21 శాతం అదనంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 87 మంది బాలికలు ఫస్ట్‌క్లాస్ సాధించగా.. 31 మంది సెంకడ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. 18 మంది విద్యార్థినులు 500 పైగా మార్కులు సాధించారు. 580 మార్కులతో సీహెచ్ కోమలి పాఠశాల టాపర్‌గా నిలిచింది. సీహెచ్ దీపికాంజలి-578, కె.రేణుక-568, సీహెచ్ అంజలి-566, ఎ.రూపశ్రీ-563, షేక్ వసీమా సుల్తానా-560, ఎస్డీ సాగుప్తా-547, పి.కావ్యశ్రీ-547, షేక్ సనా-543, ఎం.శివపార్వతి-539, ఎస్డీ మెహిముదాపర్విన్-517, ఎస్.మహలక్ష్మి-517, కె.మధులత-517, కె.ప్రవల్లిక-513, వై.లక్ష్మీకుమారి 509, ఎ.భానుచంద్రిక-504, షేక్ అరిఫా పర్విన్-503, టి.సిరి తన్మయ్ కృష్ణ-500 మార్కులు సాధించారు. గణిత శాస్త్రంలో సీహెచ్ కోమలి, ఎ.శివపార్వతి వంద శాతం మార్కులు సాధించారు. సాంఘిక శాస్త్రంలో కె.రేణుక 100 మార్కులు సాధించింది. విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సమూల మార్పులతో ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుతూ వస్తోంది. దీంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.మాధవీలత ప్రత్యేకంగా అభినందించారు.

నేను మీ రాంబాబును.. ఆశీర్వదించండి

- రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో మంత్రి అంబటి రాంబాబు ప్రచారం
- జనసేన, టీడీపీ నుంచి పలువురి చేరిక

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మద్దతు తెలపాలని గ్రామస్తులను కోరారు. 24న నరసరావుపేట వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, 25న తాను సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు పట్టి, అంబటికి ఘన స్వాగతం పలికారు.

టీడీపీ, జనసేన నుంచి చేరికలు..

తెలుగుదేశం పార్టీ నుంచి మేడిశెట్టి బొల్లారావు, శేషగిరిరావు, జనసేన పార్టీ నుంచి బస్వల కాంతారావు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని మంత్రి అంటి రాంబాబు పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. కష్టపడి పనిచేయాలని, పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, లాయర్ పక్కాల సూరిబాబు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరావు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ హరి సూరమ్మ నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ తోట మోహన్‌రావు, బండి కోటినాగిరెడ్డి, తోట లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో మంత్రి అంబటి రాంబాబు



నర్సింగపాడు ఎన్నికల ప్రచారంలో మంత్రి అంబటి రాంబాబు

వైఎస్సార్ సీపీదే విజయం

నకరికల్లు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నర్సింగపాడు, బాలాజీ నగర్ తండా గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. గ్రామంలోని ఆలయంలో మంత్రి పూజలు నిర్వహించారు. పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకుల ఇళ్లకు వెళ్లి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఈ నెల 24న నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్‌యాదవ్, 25న సత్తెనపల్లి అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నకరికల్లుకు చెందిన వేముల రాజేంద్ర టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ సంగు శివారెడ్డి, లక్ష్మిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అచ్చమాంబ తిరునాళ్ల



సత్తెనపల్లి: మండలంలోని నంది గామ, గుడిపూడి గ్రామాల్లో మాతృశ్రీ అచ్చమాంబ తిరునాళ్ల మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మాతృశ్రీ అచ్చమాంబ, పుల్లయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అటవీ ప్రాంతాల్లో ఉపాధి పనుల పరిశీలన

బెల్లంకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అటవీ ప్రాంతాల్లో చేపట్టేందుకు గుర్తించిన పలు పనులను మంగళవారం జిల్లా అటవీ శాఖ అధికారి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్ పరిశీలించారు. పాపాయిపాలెం, మాచాయ పాలెం అటవీ ప్రాంతాల్లో అమృత్ సరోవర్, మినీ అమృత్ సరోవర్, ఫాం పాండ్ల తవ్వకాలు, ఇంకుడు గుంతల పనులను గుర్తించారు. వారి వెంట ఏపీఓ కోటమ్మ, సత్తెనపల్లి ఏపీవో నారాయణ, టీఏ చిరంజీవినాయక్, అటవీ శాఖ డీఆర్‌ఓ రమణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలను వివరిస్తూ..



ఆవులవారిపాలెం(క్రోసూరు): ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామ సచివాలయాల పరిధిలో గత ఐదేళ్లలో సంక్షేమ ఫలాలు రూ.20.2కోట్లు అందినట్లు మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియం బృందం మంగళవారం అవగాహన కల్పించింది. ఆవులవారిపాలెం, పెరికపాడు, పెరికపాడు తండాల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోసం బృందం ఎన్నికల ప్రచారం చేపట్టింది. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ సచివాలయ పరిధిలో రూ.3.78 కోట్లు ఖర్చు చేసి మంచి నీటి ట్యాంకు, రోడ్ల పనులు చేపటినట్లు చెప్పారు. పెదకూరపాడు ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావును, నరసరావుపేట ఎంపీగా పి.అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించుకోవాలని కోరారు. సోషల్ మీడియా కార్యకర్తలు షేక్ ఇమ్రాన్, షేక్ బాజి, షేక్ ఖలీల్, గాలిసైదా పాల్గొన్నారు.

శంకరరావును మరోసారి ఆశీర్వదించండి

అనంతవరం(క్రోసూరు): ఎమ్మెల్యేగా ఐదేళ్లలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన నంబూరు శంకరరావును మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి నంబూరు వసంతకుమారి కోరారు. మంగళవారం మండలంలోని అనంతవరంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి గత ఐదేళ్లలో జరిగిన మంచిని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాల్వపల్లి సాంబిరెడ్డి, ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, దొండేటి మాధవరెడ్డి, పట్టీల శ్రీను, పోతురాజుగురుస్వామి, అనంతలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

గెలుపు ఖాయం.. మెజార్టీ పైనే అసలు చర్చ

పెదకూరపాడు: వైఎస్సార్ సీపీ పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థిగా నంబూరు శంకరరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అన్ని గ్రామాల నుంచి 40 వేల మందికి పైగా ప్రజలు ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు. ఇప్పుడు ఇదే అంశం.. నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. నామినేషన్ సందర్భంగా పెదకూరపాడు పట్టణం జనసంద్రమైంది. వీధులు కిక్కిరిసేలా ప్రజలు వచ్చి మద్దతు పలకడంతో శంకరరావు గెలుపు ఖాయమని స్థానికులు చర్చించుకున్నారు. స్పష్టంగా ఫ్యాను గాలి వీయడంతో.. ఇక ఆయనకు ఈ సారి ఎంత మెజార్టీ వస్తుందోనని మాట్లాడుకున్నారు. 2019లో తొలి ప్రయత్నంలో నంబూరు శంకరరావు 14 వేల పైచిలుకు ఓట్లతో పెదకూరపాడు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గెలుపొందారు. ఈ క్రమంలో రెండోవసారి ఆయన నామినేషన్‌కు అశేష జనవాహిని తరలిరావడంతో..అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని, ఫ్యాను ప్రభంజనం ఖాయమని చర్చలు సాగుతున్నాయి.

గెలుపు బాటలు..

పీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలతో పాటు.. పెదకూరపాడు ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావు చేసిన అభివృద్ధి ప్రజల్లో విశ్వసనీయతను, మద్దతు కూడగట్టుకునేలా చేసింది. గత ఐదేళ్లలో శంకరరావు పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చారు. ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులతో అభివృద్ధి పనులు చేశారు. పార్టీలకు, కులాలకతీతంగా తన వంతు సాయం అందించారు.

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా

ఎన్నికల ప్రచారంలో నంబూరు శంకరరావు

పెదకూరపాడు: ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి చూశారని, మరోసారి ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థి నంబూరు శంకరరావు ప్రజలను కోరారు. మంగళవారం పెదకూరపాడు మండలంలోని కాశిపాడు, తమ్మవరం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఐదేళ్లలో పెదకూరపాడు రూపురేఖలు మార్చానని, మరో అవకాశం ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.



కాశిపాడులో ప్రచారంలో చిన్నారితో నంబూరు శంకరరావు

వైభవంగా పకీరమ్మతల్లి తిరునాళ్ల

అచ్చంపేట: మిట్టపాలెంలో కొండపై కొలువైన గ్రామదేవత పకీరమ్మ తల్లి తిరునాళ్ల మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. పూజారులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శంకరరావుకు ఆలయ మర్యాదులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయతో భక్తులంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వహకులు తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చశారు.

నేడు వేల్పూరులో ప్రతిష్ట వేడుకలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతనంగా పునః ప్రతిష్ఠ చేయనున్న నీలకంఠేశ్వర బాల త్రిపుర సుందరిదేవి ఆలయ ప్రతిష్ఠా వేడుకల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం పూజ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో దక్షిణా మూర్తి నందీశ్వర, గణపతి, కుమారస్వామి, ద్వారపాలకుల విగ్రహాలతో పాటు కలశ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా నిర్వహించుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 24న ఉదయం ప్రతిష్ఠా వేడుకలు వేద పండితుల వేదమంత్రాలు, మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి సన్నిధిలో మంత్రి అంబటి



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామిని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు మంగళవారం దర్శించుకున్నారు. చండీ హోమంలో పాల్గొన్నారు. మంత్రి అంబటికి వేద పండితులు స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో ఆయనకు విజయం చేకూరాలని ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిట్టా విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్ బాషా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు గల్లంతే

అంబటి విజయలక్ష్మి ఇంటింటి ప్రచారం

సత్తెనపల్లి: టీడీపీ నాయకుల మాటలు నమ్మి వారికి ఓటేస్తే సంక్షేమ పథకాలన్నీ గల్లంతవుతాయని మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలోని కుంభకర్ణ రెస్టారెంట్ వద్ద నుంచి మంగళవారం పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. పేదల జీవితాల్లో మార్పులు సీఎం వైఎస్ జగన్ పాలన ద్వారానే సాధ్యమన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, వార్డు ఇన్‌చార్జి రేపూడి విజయకుమారి, వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి ప్రమీల, కో-ఆప్షన్ మెంబర్ కొణతం స్వాతి, రాయిడి విజయ, ఎస్సీ సెల్ పట్టణ గుజ్జర్లపూడి కృపావరం, నాయకులు దేవరశెట్టి రవికుమార్, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యాక్షన్‌కి తెరలేపుతున్న టీడీపీ నాయకులు

బెల్లంకొండ: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు ఫ్యాక్షన్ ప్రోత్సహిస్తున్నారని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు.

మండలంలోని న్యూ చిట్యాలలో మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగిరెడ్డిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం దగ్ధమైన ఘటనపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, స్థానిక నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల వేళ గ్రామాల్లో గొడవలు సృష్టించాలని టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రెండు రోజులు క్రితం నాగిరెడ్డిపాలెంలో తమ పార్టీకి చెందిన ప్రచార వాహనాలను అడ్డుకొని, టీడీపీ నాయకులు దౌర్జన్యం చేశారని గుర్తుచేశారు. టీడీపీ ఆఫీసును వారే తగలబెట్టుకొని నిందలు తమపై వేయడం సిగ్గుచేటు అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, సర్పంచ్‌లు ప్రతాపరెడ్డి, శేషిరెడ్డి, కంభంపాటి పాప, సాంబశివారెడ్డి, నరసింహానాయక్, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, సైదయ్య, బాబూజీ, ఎంపీటీసీలు మర్రి శ్రీనివాసరెడ్డి, మాదాసు రాంబాబు, నరసింహానాయక్, రేగులగడ్డ శ్రీను, నాయకులు చిట్టిబాబు, బొడ్డుపల్లి రాము,నారుమళ్ల రామకోటి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆలయంలో చోరీ

రొంపిచర్ల: స్థానిక శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవే పక్కన గల షిరిడీ సాయిబాబా ఆలయంలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని దొంగలు బాబా ఆలయ గేటు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని హుండీని గుడి వెనుక భాగం లోగల లోయలోకి తీసుకువెళ్లి పగులగొట్టి అందులో ఉన్న కానుకలను తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కె.పి. రవీంద్రబాబు సంఘటనా స్థలా నికి చేరుకొని పరిస్థితులను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముందస్తు పన్ను చెల్లింపునకు ఆరురోజులే గడువు

నరసరావుపేట: ఈ ఆర్థిక ఏడాది ఆస్తి పన్నులను ముందస్తుగా చెల్లించి ఐదుశాతం రాయితీ పొందే అవకాశం ఇంకా ఆరురోజులు మాత్రమే ఉన్నందున వెంటనే పురప్రజలు పన్ను చెల్లించి పురపాలక అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ చింతా రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అడ్వాన్స్ టాక్స్‌పై రెవెన్యూ అధికారులు, వార్డు కార్యదర్శులతో కౌన్సిల్‌హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ఎంత వసూలు చేశారు, పన్ను ఇంకా ఎంత వసూలయ్యే అవకాశం ఉందని అధికారులను ఆరా తీశారు.

వినుకొండ ఏజీపీగా జయప్రకాష్



నరసరావుపేట టౌన్: వినుకొండ మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా న్యాయవాది గాలి జయప్రకాష్‌ను మంగళవారం నియమించారు. ప్రస్తుతం నరసరావుపేట సబ్ కోర్టు, మున్సిఫ్ కోర్టులకు ఏజీపీగా న్యాయవాది గాలి జయప్రకాష్ వ్యవహరిస్తున్నారు. వినుకొండ కోర్టు ఏజీపీ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆస్థానంలో నరసరావుపేట ఏజీపీను ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు జయప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.